## క్లుప్తంగా

### లారీని ఢీకొట్టిన వ్యాన్



వాజేడు: ముందు వెళ్తున్న లారీని వెనుక వస్తున్న ధాన్యం లోడు వ్యాన్ ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలోని మండపాక వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇసుక లోడుతో వెళ్తున్న లారీ మండపాక వద్ద స్పీడ్ బ్రేకర్లను దాటుతుంది. అదే సమయంలో ధాన్యం లోడుతో వెనుకాల వస్తున్న వ్యాన్ లారీ వెనుక భాగంలో తగిలింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

### రక్తపోటుతో వ్యక్తి మృతి



వాజేడు: అధిక రక్తపోటుతో మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన రైతు కుడుముల సీతారామయ్య(48) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల సీతారామయ్య రోజు వారిలాగే వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి రాత్రి భోజనం చేసి పడుకుందామని ఇంట్లోకి వెళ్తుండగా ఒళ్లు తిప్పినట్లు అవడంతో కుమారుడి సహకారంతో మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లాడు. అక్కడ కింద పడిపోగానే ఆర్ఎంపీ వైద్యుడు వెంటనే ఏటూరునాగారం ప్రభుత్వ వైద్య శాలకు తీసుకు వెళ్లాలని సూచించాడు. ఏటూరునాగారంలో ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉందని ములుగు తీసుకు వెళ్లాలని చెప్పడంతో అక్కడి తీసుకు వెళ్తుండగానే మార్గ మధ్యలో మృతి చెందాడు. బీపీ 198 ఉన్నట్లుగా బంధువు నల్లెబోయిన సమ్మయ్య తెలిపాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు అమ్మాయిలు ఉండగా ఒక అమ్మాయికి పెళ్లి చేశాడు.

### చికిత్స పొందుతూ ఒకరి..

రేగొండ: మండలంలోని భాగిర్తిపేట శివారులో ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీ కొట్టిన సంఘటనలో మహారాష్ట్రలోని శోభానగర్‌కు చెందిన లాల్సు వాలే తెలామి (36) ఇటీవల గాయపడ్డాడు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య మాధురి లాల్ తెలామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదెల మృతి



ఏటూరునాగారం: విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని ముళ్లకట్ట 163 జాతీయ రహదారి వెంట శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముళ్లకట్ట గ్రామానికి చెందిన గడిగ రామయ్య, చెల్ల సత్యరాజులకు చెందిన రెండు పాడిగేదెలు శుక్రవారం మేత కోసమని 163 జాతీయ రహదారి వెంట వెళ్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన ఎర్త్‌వైర్ తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.ఒక లక్ష నష్టం వాటిల్లిందని తమకు నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు.

# కొనుగోళ్ల ప్రారంభం ఎప్పుడో..?

- కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఎదురుచూపులు
- పంట చేతికొచ్చినా ఏర్పాటులో జాప్యం



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

చిట్యాల: మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు తమ ధాన్యాన్ని అక్కడే ఎండబెట్టి విక్రయించుకునే వీలుంటుంది. కానీ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోండంతో రైతులు పొలాల వద్ద, రహదారి వెంట పంటను ఆరబెట్టాల్సిన పరిస్థితి. మండలంలో ఒక్కటి, రెండు చోట్ల తప్ప పూర్తి స్థాయిలో ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం చేతికందిన పంటలకు నీరు లేక పోవడంతో తక్కువ దిగుబడి వచ్చిందని వచ్చిన ధాన్యానికైనా మద్దతు ధర ఇచ్చి త్వరతగతిన కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### వర్షం వస్తే ఇబ్బందే..



ఆరుగాలం కష్టపడి నాలుగు ఎకరాలలో వరి ధాన్యం పండించి అరబెట్టాను. వర్షం వస్తే ఇబ్బందే. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలి.

–బిల్లా సరోత్తం రెడ్డి, రైతు, నవాబుపేట

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



రేగొండ: వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న హెచ్ఎం

రేగొండ: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వేల్పుల రాజు అన్నారు. మండలంలోని భాగిర్తిపేట ఉన్నత పాఠశాలలో ముందస్తుగా అంబేడ్కర్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. సమసమాజ నిర్మాణానికి, స్వేచ్ఛ సమానత్వంను పెంపొందించడానికి అంబేడ్కర్ సిద్ధాంతాలు ఉపయోగపడ్డాయని కొనియాడారు. ఉపాధ్యాయులు ఓనపాకల రాజయ్య, కొండ శ్రీనివాస్, ఇంద్రసేనా రెడ్డి, వేల్పుల రాజు, సంపతి భాగ్యలక్ష్మి, అబ్బోజు అనురాధ, సూదమల్ల మురళి, వ్యాయమ విద్య ఉపాధ్యాయుడు సూదం సాంబమూర్తి, సనత్ కుమార్, గుండా రమేష్, చెన్న సరిత, చంద్రమౌళి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని బరిగాలనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా అంబేడ్కర్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం కొత్తపల్లి పాషన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారత తొలి న్యాయ శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించిన మహోన్నతవ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆలయంలో అనఘాదేవి సమేత, అనఘస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి శ్రీ దత్త విజయానంద తీర్థస్వామి హాజరై మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆలయంలో అనఘాదేవి సమేత, అనఘస్వామి విగ్రహలతో పాటు కుక్కుటేశ్వర స్వామి, సచ్చిదానంద గణపతి, కార్యసిద్ధి ఆంజనేయ స్వామి, పురుహూతిక మాత సహిత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమాలు కాల్చి, అభిషేకాలు చేశారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో వామనరావు, అర్జున్ రావు, ప్రసాద్, బండారి సదానందం, కుమారస్వామి, సాదు మహేందర్, బొట్ల లక్ష్మీరాజం, సాదు ధర్మేందర్, బండారి దేవేందర్, ఆరే సుధాకర్, సాదు సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ‘మాదిగలను విస్మరించిన పార్టీలు’



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

కాటారం: మాదిగ సామాజిక వర్గాన్ని ప్రధాన పార్టీలు విస్మరించి తీవ్ర అన్యాయం చేశాయని పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి అక్కపాక తిరుపతి అన్నారు. కాటారం మండల కేంద్రంలో టీడీపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అందె భాస్కరాచారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తిరుపతి మాట్లాడారు. టీడీపీ తెలంగాణలో పోటీ చేయడం లేదని అందుకోసం టీడీపీ, మాదిగ సామాజిక వర్గం, మాదిగ దండోర మద్దతుతో పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు పేర్కొన్నారు. 20 సంవత్సరాలుగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ టీడీపీలో చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఒక్కసారి ఓటు వేసి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పోటు సుశీల, మాజీ ఎంపీటీసీ అందె సంధ్యారాణి, చీర్ల మల్లారెడ్డి, వేల్పుల నారాయణ, పోటు లత, ప్రభాకర్ పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



మహాముత్తారం: సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై



ఎస్ ఎస్ తాడ్వాయిలో..

మహాముత్తారం: గత సంవత్సరం క్రితం ఆజాంనగర్ గ్రామానికి చెందిన సతీష్‌తోపాటు, సీహెచ్ రాజు అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఇద్దరు వ్యక్తులకు పోలీస్ స్టేషన్‌లో ఫోన్లను అప్పగించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. తమ ఫోన్లను ట్రాక్ చేసి పట్టుకొని అమకు అప్పగించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎస్ తాడ్వాయి: ఫిబ్రవరి నిర్వహించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు పొగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్లను తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి బాధితులకు శనివారం అప్పగించారు. జాతర సమయంలో అమ్మవార్ల దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు రద్దీ సమయంలో వారి సెల్‌ఫోన్లను పొగొట్టుకున్నారు. ఈ విషయంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేసి సెల్‌ఫోన్ల రికవరీ చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### అభినందన

భూపాలపల్లిరూరల్: భూపాలపల్లి మండలం పెద్దాపూర్ (వెంకటేశ్వర్లపల్లి)గ్రామానికి చెందిన ఆకుదారి సమ్మక్క–కృష్ణస్వామి దంపతుల కుమారుడు ఆకుదారి రాజ్‌కుమార్ హైదరాబాద్‌లోని ఉస్మానియ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి శుక్రవారం పట్టా పొందాడు. దీంతో గ్రామస్తులు, స్నేహితులు రాజ్‌కుమార్‌కు శనివారం అభినందించారు.

# పరిచయం లేని వ్యక్తికి సీటు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: బీజేపీకి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఒప్పందం కుదుర్చుకుందని, అందుకు నిదర్శనమే వరంగల్ పార్లమెంట్ స్థానానికి ఎవరికి పరిచయం లేని వ్యక్తికి సీటు ప్రకటించిదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి అమ్మ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. గతంలో రైతులకు వ్యతిరేకంగా రైతు చట్టాలను తీసుకురావడంతో 760 మంది రైతులను పొట్టనపెట్టుకున్న బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. వరద బాధితులను పట్టించుకోని కేసీఆర్ ఆగస్టులో గండి పడ్డ చెరువులకు మరమ్మతులు చేపించకుండా నేడు పంటల పరిశీలన కార్యక్రమాలను చేపట్టడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే 5 గ్యారెంటీలను అమలు పర్చినట్లు తెలిపారు. గాంధీనగర్‌లో కేజీ టూ పీజీ, ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు నిధులు సైతం మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాజర్ల అశోక్, కటంగూర్ రాంనర్సింహారెడ్డి, అప్పం కిషన్, కత్తి సంపత్, బండి సుదర్శన్, వైనాల రవీందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్



మహదేవపూర్: మండలంలోని బేగ్లూర్ గ్రామ సమీపంలో మిర్చి చేళ్లలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బేగ్లూర్ గ్రామ సమీపంలో మిర్చి చేళ్ల కల్లల వద్ద అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు ఫోన్లు, రూ.23,550 స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### గుడుంబా స్థావరాలపై దాడులు

ఏటూరునాగారం: మంగపేట మండలం తిమ్మంపేట, బోరునర్సాపురంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలం తిమమంపేట, బోరునర్సాపురం గ్రామాల్లో దాడులు చేసి 20 లీటర్ల గుడుంబా, 600ల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు తిమ్మంపేటకు చెందిన ధరావత్ రాంబాబు, బోరునర్సాపురం గ్రామానికి చెందిన భూక్య సంపత్, షేక్ షమీనాలపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది నవీన్, తిరుపతి, నాగరాజు, వీరన్న పాల్గొన్నారు.

### పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ఎండి అమ్జద్ పాషా తండ్రి కాసీం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ శనివారం పరామర్శించారు. కాసీ మృతదేహం వద్ద నివాళులర్పించారు. జంపాల రవీందర్, ముత్యాల రాజు, బండి నర్సయ్య, కొమురయ్య, సాగర్, రమేష్, రవిచందర్, రాజు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కోమటిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ లోడె వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చైతన్య యూనియన్ సభ్యులు శనివారం పరామర్శించి రూ.4600 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మహమూద్, ఉపాధ్యక్షుడు గద్దం శోభన్, రాజు, వెంకన్న, ముకుందం, నర్సింగరావు, బోలేష్, మున్నా, రమేష్, కోటయ్య పాల్గొన్నారు.

# ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: ఓటును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ మల్లేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బు, ఏ విధమైన ప్రలోభాలకు లొంగకుండా భయభ్రాంతులకు గురి కాకుండా ప్రజలు తమ విలువైన ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు



బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో వాహనాల్లో ఎవరైనా మద్యం, నగదును అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని ప్రధాన రోడ్ల వెంట వాహనాలను తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అక్రమంగా ఎవరైనా మద్యం రవాణా చేస్తే మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి ఉండాలని, అతిక్రమించిన వారిపై చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్‌లు సుమన్, రంజిత, రమణ, గంగరాజు ఉన్నారు.

# ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావ్య



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పలువురు నాయకులు అన్నారు. మండలంలోని బంగ్లాపల్లె గ్రామంలో భూ లక్ష్మి, బొడ్రాయి, ఆంజనేయస్వామి, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్‌రావు, వరంగల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యలు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వర్షాలు అనుకూలంగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం



భూపాలపల్లి రూరల్: శ్రీపాదరావు వర్ధంతిలో పాల్గొన్న నాయకులు



మహాముత్తారంలో..



మల్హర్‌లో..

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు చోట్లు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంతో పాటు మంథని నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



కాటారం: శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

# చలివేంద్రం ప్రారంభం



తాగునీరు అందిస్తున్న సుధీర్

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డులో గండ్రకోట సుధీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుధీర్‌యాదవ్ శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.